

# మినీకథావీధి

రామం, రాజు, రవి ఒకే ఆఫీసులో పని చెయ్యడమేకాక. బ్రహ్మచారులు కనుక ఒకే పోర్షన్లో సహజీవనం చేస్తున్నారు

## పారిన పాచిక



ఆ రాత్రి హోటల్లో భోజనం ముగించు కుని, రోడ్లు కాస్త సర్వేచేసి తొమ్మిది గంటల ప్రాంతంలో యిల్లు చేరుకున్నారు. బట్టలు మార్చుకుని వొకడు, రేడియో వింటూ మరోడు, వుత్తరాలు రాసుకుంటూ ఇంకోడు,పుస్తకం చదువుకుంటూ కూర్చు న్నారు. ఆ ముగ్గురూ కూడా స్మోకర్లే కావడం ఒక విశేషం.

ఆఖరు సిగరెట్టు ముట్టించి. పెట్టె అవతల విసిరేసిన రామానికి మరో అరగంట కల్లా యింకోసిగరెట్టు కాల్చా లన్పించింది. తన దగ్గర లేవు కనుక మిత్రుల మీద ఆధారపడాలని నిశ్చయించుకుని-

"ఒరేయ్ రాజూ!.... ఓ సిగరెట్టు ఇలా చదివించుకోరా...." అన్నాడు.

"సారీ బ్రదరూ! నా దగ్గరున్నవిరెండే. ఒకటి రేపు ఉదయమే కావాలి. మరోటి ఇంకాస్సేపట్లో తాగెయ్యాలి .... తనకు మాలిన ధర్మం లేదుకదా!....కనుక...." అంటూ తన అశక్తతని వెల్లడించాడు రాజు.

నాలుక దురదని అణుచుకోలేని రామం రవివైపు తిరిగాడు సిగరెట్టుకోసం చెయ్యి సాచాడు.

రవి అన్నాడు :

"నా దగ్గర అయిదు సిగరెట్లు వున్నా యిరా! నీతో అబద్ధం ఎందుకు చెప్పాలి? కానీ నీకు ఇవ్వాలంటేనే బాధగా వుంది. ఒక్కొక్కదాని ధర పావలా. ప్రతి బడ్జెట్‌లోనూ ఈ సిగరెట్ల ధర పెంచకుండా వుండలేకపోతున్నారు ఆర్థికశాఖామాత్యులు. అందుకే మొన్న బడ్జెట్ తర్వాత నిర్ణయించుకున్న దేమిటంటే- ఒకళ్ళకి సిగరెట్లివ్వరాదు అని."

వాడి లెక్చర్‌కి ఒళ్ళు మండిపోయింది రామానికి.

భరించక తప్పదు. తనిప్పుడు వాడి మీద ఆధారపడి వున్నాడు.

అందుకే మరోసారి బ్రతిమాలాడు. ఫలితం శూన్యం.

రామానికి మాత్రం అనీజీగా వుంది. పోనీ వెళ్ళి కొనుక్కుందామా అంటే షాపులన్నీ ఇంటికి దూరం. కనీసం పావు గంట నడక.

చేసేదేమీ లేక ఊరుకున్నాడు.

మరో పావుగంట గడిచాక మెరుపులా ఆలోచన వచ్చింది రామానికి.

"ఒరేయ్ రవీ?.... నిన్నోటి అడగాలని మర్చిపోయాను" అన్నాడు.

"ఏమిటి?" అన్నాడు పుస్తకం లోంచి తల ఎత్తకుండా.

"నాకో అయిదు వందలు అప్పు కావాలి. ఎలాగైనా సర్దరా...."

"నేనా?...."

"అవున్రా. మా నాన్న దగ్గర్నుంచి సాయంత్రం ఉత్తరం వచ్చింది. మా తమ్ముడ్ని కాలేజీలో చేర్పించాలట. నీ అప్పు నెమ్మదిగా తీరుస్తాను. కాదనకు.." అన్నాడు రామం పరిస్థితి వివరిస్తూ.

"ఒరేయ్.... నా పరిస్థితీ. జీతం, బాధ్యతలు—అన్నీ తెల్సిన నువ్వు ఇలా నన్ను అడగటం బాగుందా? నెలకొక్క పైసా కూడా మిగుల్చుకోలేని నేను నీకు ఇంత అప్పు ఎలా ఇవ్వగలనురా...." అన్నాడు రవి.

"ఏమిటోరా....నీ ధోరణి అసలు బాగోలేదు. ఇందాకా సిగరెట్ అడిగితే ఇవ్వనన్నావు. ఇప్పుడు అప్పు అడిగితే లేదంటున్నావు. నేను ఏదిఅడిగినాకాదనేస్తున్నావేమిట్రా? నా కసలు ఏమీ ఇయ్యకూడదని నిర్ణయించుకున్నావా?...." అన్నాడు బాధగా రామం.

"ఛఛ.... అదేం కాదురా!.... అలాంటి నిర్ణయం ఏదో చేసుకున్నానని అనవసరంగా అపార్థం చేసుకుంటున్నావు. నీ ఊహలు తప్పు అని నిరూపించడం కోసం నీకు సిగరెట్ ఇస్తాను తీసుకో.... కాల్చుకో...." అంటూ ఓ సిగరెట్ ఇచ్చాడు. తనోటి తీసుకొని ఒకే అగ్గిపుల్లతో రెండూ వెల్గించాడు.

నాలుక దురద తీరిన రామం రిలీఫ్‌గా సిగరెట్ కాల్చసాగాడు.

తనకు అవసరం లేకపోయినా సిగరెట్ లాగడం కోసం అప్పు అడిగాడు.

అయిదు వందల అప్పు ముందు సిగరెట్ చిన్నదికదా!

రామానికి తమ్ముడంటూ ఎవ్వరూ లేరని ముందే తెల్సిన రాజు అతని పాచిక అర్థం అయినట్లుగా సన్నగా నవ్వుకున్నాడు.

పాపం రవి మాత్రం, అప్పు ఇచ్చే దారుణ పరిస్థితి తప్పినందుకు సంతోషిస్తూ సిగరెట్ పొదుపుగా తగ్గించసాగాడు.

— పాలకూర సీతాలత

రాజారావులో ఓర్పు నశించింది, ఆవేశం పెరిగింది, అంతరాత్మ మాత్రం "ఆవేశపడొద్దు ; ఇక్కడే ఏర్ కండిషన్డ్ హాల్లో హాయిగా వుంది, ఆలస్యం అవడంవల్ల నీకేం నష్టంలేదని వారించింది.

ఒక విధంగా అంతరాత్మ మాటలు నిజమే. అయినా అభిమానం అడ్డొచ్చి రాజారావు కోపం తగ్గలేదు ఎదురుగుంతా కేష్ కౌంటర్‌లో కృష్ణవేణి గొంతు కోయిల స్వరంలా ఒక్కొక్క టోకన్ నంబరు పిలుస్తున్నప్పుడు తను ఓడిపోతున్నట్టనిపించింది రాజారావుకు. వస్తున్న కోపాన్ని అణచుకోలేక కేష్ కౌంటర్‌కేసి నడిచాడు తన టోకన్ నంబరుచెప్పి "వచ్చిందా" అని అడిగాడు.